# నల్లచీమ

**ప్రజాస్వామ్యంలో పాలక పక్షం కన్నా ప్రతిపక్షానిదే కీలకపాత్ర. ప్రతిపక్షం కూడా పాలకులతో చేతులు కలిపితే జనసామాన్యం మాటేమిటి?**

అనగనగా ఒక నల్లచీమ. ఆ నల్లచీమ ఒక రోజు ఏం చేసిందంటే, సింహం రాజు గారిని చూడడానికి రాజ గుహకు వెళ్ళింది.

రాజుగారి 'గుహ' అంటే మాటలా! మందీ మార్బలం... కాపలాదారులు! అంత సులభంగా చీమకు గుహ ప్రవేశం దొరుకుతుందా!

ప్రధాన కాపలాదారైన తేలు మన నల్లచీమను మొదటి ద్వారం దగ్గరే ఆపేసింది.

"దండాలు తేలన్నా. జెర లోపలికి పోనియ్యి" అని నల్లచీమ బతిమలాడింది.

తేలుకు తోకలో విషం ఉంటుంది కదా. ఆ తోకను అటూ ఇటూ ఆడించింది తేలు. అంటే, పరిహాసం అన్నమాట. 'నీ బతుక్కు రాజదర్శనమా' అని గేలి.

చిత్రాలు: నర్సిం

నల్లచీమ కష్టాల్లో ఉంది కదా- పరిహాసాల్నీ, పరుష పదాల్నీ పట్టించుకుంటుందా! పట్టించుకోదు. పదేపదే బతిమలాడింది. పబ్బతి పట్టింది.

"తేలన్నా, జెర దయ చూడన్నా" అని ప్రాథేయపడింది.

తేలన్న దయ చూడలే. ధర్మం చూడలే. తోక ఆడించడం ఆపలే.

"పో పో..." అని కసురు.

"జెర పోనియ్యి తేలన్నా. నీకు దండం పెడ్తా. కాళ్ళు మొక్కుతా. శానా ఆపదల ఉన్నా. రాజుగారి దర్శనం చేసుకోవాలె. జెర ఇడువు తేలన్నా."

నల్లచీమ ఎంత మొరపెట్టుకున్నా తేలు ససేమిరా వింటేనా! విన్లేదు. దూరంగా తరిమేసింది.

"రాజదర్శనం కావాలట... రాజ దర్శనం! చీమకీ, దోమకీ రాజ దర్శనమే" అని కసురుకుంది.

దగ్గరలో చెట్టు కొమ్మమీద కూర్చున్న ఓ పిచ్చుక అదంతా గమనిస్తోంది.

చీమను చూసి పిచ్చుకకు జాలేసింది. అయ్యోపాపం! నల్లచీమ ఎన్ని కష్టాల్లో ఉన్నదో కదా, అందుకే రాజదర్శనానికి వచ్చింది అనుకుంది.

కొమ్మమీద నుంచి కిందికి దూకి, గెంతుకుంటూ గెంతుకుంటూ చీమను సమీపించి, "తేలు నిన్ను ఊరకే లోనికి పోనిస్తుందా చీమ బావా! లంచం ఏవన్నా తీసుకొని రావొద్దూ" అని అడిగింది.

"లంచమా! లంచం ఇచ్చే పరిస్థితిలో ఉంటే ఇక్కడిదాకా ఎందుకు వస్తును. ఈ తేలుతో ఇన్ని మాటలెందుకు పడ్తును" అన్నది నల్లచీమ దీనంగా.


"నీకొచ్చిన కష్టమేమిటి? రాజదర్శనానికి ఎందుకొచ్చావ్ చీమ బావా?" ఆత్మీయంగా అడిగింది పిచ్చుక.

అట్లా పిచ్చుక అడిగేసరికి కడుపులోని బాధంతా వెల్లబోసుకుంది నల్లచీమ. వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఏం చెప్పను బావా! మా ఆశలు అడియాస లైనయ్. మా బతుకులు బజార్నపడినై. పత్తికి బాగ గిరాకీ ఉన్నది కదా అని ఈ ఏడు చాలా మందిమి పత్తి వేసినం. మా పొలాలల్ల ఏపుగ పెరిగిన పత్తి పంటను చూసి 'ఇగ కష్టాలు బాస్తయి. మా అప్పులన్నీ తీర్తయి' అని గంపెడాశ పడినం. పత్తికాయ పేలినట్లు మా బతుకులు పేలిపాయె. మా గోస ఏ దేమునికి ముడ్తది? ఏ జంతువుకు ముడ్తది? రాజు ఎటు చక్రం తిప్పిండోగాని ఉన్నట్లుండి పత్తి గిరాకీ పడిపాయె. పత్తి ధర పడిపాయె. పత్తి కొనే నాథులే లేకపోయిరి. ఎంతల ఓడలు బండ్లాయె కదా బావా! పత్తి పంట చూసి ఎంత మురిసిపోతిమి. ఎన్నెలే మా పొలాలల్ల కాసింది అనుకుంటిమి. ఎండి గుత్తులే మా పొలాలల్ల మొలిసినై అనుకుంటిమి. పాత అప్పులన్నీ తీర్తయి అనుకుంటిమి. పొలగాళ్ళను బాగ సదివిస్తం అనుకుంటిమి. పెళ్ళీడుకొచ్చిన పొల్లల పెళ్ళిళ్ళు చేస్తం అనుకుంటిమి. కడుపునిండ తింటం అనుకుంటిమి. గిట్ల ఒక్కసారే గిరాకీ పడిపోతది అనుకోలే. పాత అప్పులకు కొత్త అప్పులు తోడైతయి అనుకోలే. మా బతుకుల నెట్టేట ముంచుతయి అనుకోలె..."

"జనం తలచినదే జరిగినదా రాజు ఎందుకు చీమ బావా... అసలు నీ కష్టాలు రాజు వింటాడని ఇంతదూరం వచ్చావా బావా? నీకు రాజదర్శనం ఎట్లా దొరుకుతుంది అనుకున్నావ్? నువ్వేమన్నా విదేశీ చీమవా? విదేశాల్లో ఉంటున్న స్వదేశీ చీమవా? ప్రపంచ బ్యాంక్ ప్రతినిధివా? పేరు మోసిన గూండావా? నీకెట్లా రాజదర్శనం దొరుకుతుంది అనుకున్నావు బావా? ఎంత అమాయకుడివి బావా" అని పిచ్చుక జాలిగా నల్ల చీమ వంక చూసింది.

"అయ్యో, మరి ఇప్పుడేం చేయను బావా? విదేశీ చీమనైనా కాకపోతిని. విదేశాల్లో ఉన్న నల్ల చీమలం కాకపోతిమి. గూండాలం కాకపోతిమి. భూములు, జాగలు గుంజుకునే జులుంగాళ్ళం కాకపోతిమి.



మాకు రాజదర్శనం దొరకదా బావా!"

"ఊహూఁ..." తల అడ్డంగా తిప్పింది పిచ్చుక.

"ఎట్ల బావా! ఏం చేద్దును? మా నల్లచీమలు గంపెడాశతో నన్ను రాజు దగ్గరికి వంపినై."

"బుద్ధికి బృహస్పతులైన శుకపికాలకే రాజదర్శనం లేదు. రౌద్రాన్ని ప్రదర్శించే ఎర్రచీమలకే రాజదర్శనం లేదు. నల్లబావా నీకెట్లా రాజదర్శనం దొరుకుతుంది?"

పిచ్చుక ఆ మాట అనేనరికి నల్ల చీమకు ఒక ఆలోచన మెరిసింది.

"అయితే బావా, ఒక పని చేసేదా" అని పిచ్చుక వంక చూసింది.

"ఏమిటి బావా?"

"ప్రతిపక్షమైన ఎర్ర కళ్ళ పులి ఉన్నది కదా. ఆ పులికి మా బాధలన్నీ చెప్పుకుంట. గా పులి అయినా గాండ్రించి అడిగితే రాజు వింటడు కదా!"

"అయ్యో వెర్రి బావా! నీకసలు సంగతి తెలియదు. ఎర్ర కళ్ళ పులి రాజు ముందు గాండ్రించడం మానేసి ఎంతో కాలమైంది. ఇద్దరికీ ఏ లోపాయకారి సర్దుబాటు జరిగిందోకాని, సింహం రాజు, ఎర్రకళ్ళ పులి స్నేహితులై చెట్టపట్టాలేసుక తిరుగుతున్నారు."

"అట్లనా బావా..." నిరుత్సాహపడిపోయింది నల్లచీమ.

"వారి స్నేహం నేను కళ్ళారా చూశాను బావా! ఒకసారి సింహం రాజు సుష్టుగా భోంచేసి చెట్టు కింద విశ్రమిస్తుంటే, మంత్రి నక్క అక్కడికి వచ్చింది. నక్కను చూసి సింహం రాజు మొహం ప్రసన్నంగా మారింది. రాజుగారి మొహంలో ప్రసన్నతను చూసి మంత్రి నక్క భయపడింది."

"ఎందుకు?"

"రాజంటే ఎప్పుడూ ధుమధుమలాడ్తూ, కోపంగా కనిపించాలి కాని ప్రసన్నంగా కనిపిస్తాడా! రాజు నవ్వాడు అంటే ఏదో రాజకీయ ఎత్తుగడ వేశాడు అన్నట్టే... మన నవ్వు గుర్తులేమిటో ఇప్పటికీ నరమానవునికి తెలియవు సుమా! సింహం రాజు మొహంలో ఆగ్రహం కాక ఆనందాన్ని చూసి మంత్రి నక్క కలవరపడింది. రాజకీయాలు నక్క సొత్తు కదా... నక్క ఎట్లా చెబితే సింహం అట్లా నడవాలి కదా... అది పరిపాలన రివాజు. కోపంగా చూడక ప్రసన్నంగా చేసేనరికి, 'సింహానికి రాజకీయాలు ఒంటబట్టినాయి' అనుకొని జిత్తుల ఎత్తుల రాజకీయాల్లో ఆరితేరిన నక్క కలవరపడి సింహంతో ఇట్లా అంది -

"ఏవిటి రాజా! అలా ఉన్నారేం?"

"వేగుల ద్వారా అంతా విన్నాం మంత్రీ! మీరు ఎర్రకళ్ళ పులికి చెలిమి వల విసిరారట?"

ఆ మాట విని మంత్రి నక్క వినయంగా తల వంచుకుంది.

"భేష్ మంత్రివర్యా! భేష్! మీవంటి చతురులైన మంత్రులు ఉండడం వల్లనే కదా మా పరిపాలన మూడు ఎరలు ఆరు చేపలుగా వర్ధిల్లుతోంది. ఇంతకూ ఎర్రకళ్ళ పులికి మా గుహలో విందు ఏర్పాటు ఎప్పుడు?"

"ఎప్పుడో కాదు మహారాజా, ఇంకా స్వేపట్లోనే ఎర్రకళ్ళ పులి తమ గుహకు వేంచేస్తున్నారు. మిమ్మల్ని తోడ్కొని పోడానికే వచ్చాను."


"అయితే పద..."

సింహం రాజు పట్టరాని ఆనందంతో గర్జించే నరికి, చెట్టు మీది పిట్టలం భయంతో ఎగిరి పారిపోయాం...

నేను మాత్రం ఎగిరి ఎగిరి సింహం రాజు గుహ దగ్గరికి వచ్చి ఎర్రకళ్ళ పులి గుహలోకి వెళ్ళడం కళ్ళారా చూశాను. సింహం రాజు స్వయంగా ఎర్రకళ్ళ పులిని ఆహ్వానించడం చూశాను."

"అట్లనా బావా! దీనుల పక్షాన నిలిచే ప్రతిపక్షమే లేదా" అని వాపోయింది నల్ల చీమ.

అంతలో గుహకు పహరా కాచే వేట కుక్క వచ్చి నల్ల చీమను, పిచ్చుకను దూరంగా తరిమేసింది.



నల్లచీమ కాళ్ళీడ్చుకొంటూ, మెల్లగా మెల్లగా... ఇంటిదారి పట్టింది.

తమ ప్రతినిధి తెచ్చే సహాయ వార్త కోసం కళ్ళల్లో పత్తి వత్తులు వేసుకొని ఎదురు చూస్తున్న నల్లచీమలు... ప్రతినిధి నల్లచీమ తిరిగి వచ్చి చెప్పినదంతా విని హతాశులైపోయాయి.

పాత అప్పులకు కొత్త అప్పులు తోడై భయంతో నల్ల చీమలు వజవజ వణికిపోయాయి.

తమ ఆశల పుట్టల్ని రాజకీయ పాములు ఆక్రమించుకునేనరికి అనాథలై చీమలు అల్లాడి పోయాయి.

తమ గోడు వినే నాథులు లేక నల్ల చీమలు విల విలలాడి, తల్లడిల్లిపోయాయి.

"మహారాజుగారు రెండు నిమిషాలు మౌనం పాటించి నందుకు కృతజ్ఞతలు. ఇంత విశాల హృదయం గల మహారాజుగారు ఆత్మహత్య చేసుకున్నప్పుడు మా నల్లచీమ లన్నీ అయిదు నిమిషాలు మౌనం పాటించి కృతజ్ఞతలు తెలుపుకుంటాయి."

భవిష్యత్తు చీకటై, బతుకు భారమై, అప్పుల బాధలు, ఆకలికి తాళలేక ఒక్కొక్క నల్లచీమ ఆత్మహత్య చేసుకో సాగింది.

ఆ వార్త మెల్లమెల్లగా పాకి సింహం రాజు చెవిన పడింది. అందుకు సింహం రాజు కలవరపడలేదు. కలత పడ లేదు. ఆఫ్టరాల్ నల్ల చీమ కదా!

కొద్ది రోజుల తరువాత మంత్రి నక్క మోసుకు వచ్చిన వార్త విని మాత్రం సింహం రాజు కలవరపడి వెంటనే సభను ఏర్పాటు చేశాడు.

మంత్రి నక్క మోసుకు వచ్చిన వార్త ఏవిటంటే, చుట్టుపక్కల నాలుగు అడవులకు తమ అడవిలోని నల్లచీమలు ఆత్మహత్య చేసుకుంటున్నాయని తెలిసిపోయింది. అది పెద్ద తలవంపుగా తలచి రాజు ఆ సభను ఏర్పాటు చేశాడు.

అడవిలోని జంతువులు, పక్షులు, కీటకాలన్నీ తమ ప్రతినిధులను సభకు పంపించాయి. 'ఇకనైనా తమ కష్టాలు సమసిపోతాయి. తమ బతుకుల్లో ముసురుకొన్న చీకటి తొలగిపోతుంది' అని ఆశపడ్డాయి నల్ల చీమలు. ఆశలు వాటికి వీడని నేస్తాలు. ఎండమావులూ అంతే!

మిగతా పశుపక్ష్యాదులు కూడా నల్లచీమలను రక్షించేందుకు సింహం రాజు గారు ఏవో పథకాలు సభలో ప్రవేశపెడ్తారు అనుకున్నాయి.

సభకు చేరుకున్న తరువాత కాని వాటికి తెలియలేదు అది 'సంతాప సభ' అని!

మన అడవిలోని మన సహోదరులు... మన అవ్వలు... మన ఆత్మీయులు... మన... మన... నల్లచీమలు చేసుకుంటున్న ఆత్మహత్యల వార్త విని మన సింహం రాజుగారు ఎంతో బాధపడిపోయారు. ఎంతో కుమిలిపోయారు. ఎంతో ఇద్దైపోయారు. ఆహారం, నీళ్ళు ముట్టక కుంగి క్రుశించిపోయారు. ఆత్మహత్యలు చేసుకున్న మన... మన... నల్లచీమల ఆత్మ శాంతికి ఈ సంతాప సభ ఏర్పాటు చేశారు" అని మంత్రి నక్క ప్రసంగించిన తరువాత సింహం రాజుగారు గద్గదస్వరంలో ఇలా అన్నారు-

"నా మాట మన్నించి మీరంతా ఈ సంతాపసభకు తరలి వచ్చినందుకు మీకు కృతజ్ఞతలు తెలియజేసు కుంటున్నాను... ఆత్మహత్యలు చేసుకున్న మన నల్లచీమల ఆత్మలకు శాంతి కలుగజేయ వలసిందిగా ఆ దేవునికి తెలియజేసుకుంటున్నాను. చనిపోయిన మన... మన... మన... నల్లచీమలకు సంతాప సూచకంగా నేను రెండు నిమిషాలు మౌనం పాటిస్తున్నాను. మీరు కూడా అదేవిధంగా పాటించాలని తెలియజేసుకుంటున్నాను..."

వెంటనే సభానదులంతా లేచి నిల్చున్నారు. చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దం చోటు చేసుకుంది. రాజుగారు రెండు నిమిషాలు మౌనం పాటించేసరికి... అందరూ పాటించారు.

నల్లచీమకు మాత్రం కడుపులో పేగులవిసిపోతు న్నాయి. 'అయ్యో! ఈ మౌనం వల్ల మాకు ఒరిగేదేవిటి? సంతాప సభ వల్ల మాకు కలిగే

ప్రయోజనమేవిటి' అని వాపోయింది.

సభ మరునాటికి వాయిదా పడింది. మరునాటి సభ అజెండా ఏవిటంటే, ఆత్మహత్యలకు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించిన సింహం రాజుగారికి అభినందన.

మంత్రి నక్క నిలువెత్తు నిలువెత్తు పుష్పహారాలంత అభినందనల వాక్కులతో సింహం రాజుగారిని ముంచెత్తింది.

మిగతా మంత్రులదీ అదే వరస! రెండు నిమిషాలు మౌనం పాటించిన రాజుగారి ఔదార్యాన్ని కొనియాడుతూ జోరైన ప్రశంసల వర్షం కురిపించాయి.

వింటున్న నల్లచీమకు ఒళ్ళు మండుతోంది. తన ప్రతిఘటనను ఎలా తెలపాలో తెలియక తనలో తానే ఉడికిపోతోంది.

అంతలో ఎర్రకళ్ళ పులి లేచింది ప్రసంగించడానికి...

నల్లచీమ ఆశగా ఎర్రకళ్ళ పులి వంక చూసింది. 'ఈ మౌనాల వల్ల, సంతాప సభ వల్ల నల్లచీమలకు ఒరిగేదేవిటి' అని ఎర్రకళ్ళ పులి గాండ్రించి అడుగుతుంది అనుకుంది. నల్లచీమలు ఆత్మహత్యలు చేసుకోకుండా వ్యవసాయ రంగంలో మనం తక్షణమే ప్రవేశపెట్టే పథకాలు ఏమిటని నిలదీస్తుంది అనుకుంది.

కానీ... ఎర్రకళ్ళ పులి కూడా... కూడా... రెండు నిమిషాలు మౌనం పాటించిన సింహం రాజుగారి ఔదార్యాన్ని అలసిపోయేదాకా పొగిడి, పొగిడి పొగిడింది.

ఎర్రకళ్ళ పులి ఉపన్యాసం విన్న సభలోని పశుపక్ష్యాదులు సిగ్గుతో తలలు వంచుకున్నాయి.

ఇది ఎర్రకళ్ళ పులేనా! జనం పక్షాన నిలిచే, పులేనా అని ఆశ్చర్యపోయాయి.

పాలితుల పక్షాన నిలిచే ఎర్రకళ్ళ పులికి పాలక వర్గంతో నేస్తమా!

వాటికి ఆ దుష్ట సమానం ఒక పట్టాన అర్థమైంది. కాదు!

నల్లచీమ ఒళ్ళు సలసల కాగిపోతోంది. తలనించి ఆవిర్లు లేస్తున్నాయి.

'ఇదంతా దగా... మోసం... పచ్చిమోసం' అని బిగ్గరగా అరవాలని ఉంది. కానీ, తన గొంతుకు అంతటి గాంభీర్యం ఉందా!

గాండ్రించవలసిన పులి పిల్లికూతలు కూస్తుంటే... చిటుక్కుమనే తన గొంతు బాంబులా పేలేదెట్లా? అంతటి శక్తి తనకెట్లా వస్తుంది? మాయమాటలు వల్లిస్తున్న రాజు గుండెలో అదురు పుట్టించే గొంతు తనకెట్లా వస్తుంది?

ఏ అస్త్రాలూ, శస్త్రాలూ లేని నల్ల చీమకు ఒకే ఒక ఉపాయం తోచింది. తన ప్రతిఘటనను పొగడ్త రూపంలో ఇట్లా చెప్పింది.

"...నల్లచీమల ఆత్మహత్యలకు చలించి... మహారాజుగారు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించినందుకు కృతజ్ఞతలు. ఇటువంటి విశాల హృదయం గల సింహం మహారాజుగారు ఆత్మహత్య చేసుకున్నప్పుడు అందుకు ప్రతిగా మా నల్లచీమలన్నీ అయిదు నిమిషాలు మౌనం పాటించి తమ కృతజ్ఞతలు ప్రకటించుకుంటాయని మీ అందరికీ సవినయంగా తెలియజేసుకుంటున్నాను..."

అవి వినడానికి మామూలు మాటల్లాగే ఉన్నా... మంత్రి నక్క గుండెలోనూ, సింహం రాజుగారి గుండెలోనూ బాంబు కంటే బలంగా పేలాయి.

ఆ మాటల్లోని విమర్శనాస్త్రం సింహం రాజుగారు జీవితాంతం కుమిలిపోయే గాయాన్ని చేసింది. ప్రజల పక్షాన నిలిచే పెద్దల మెదళ్ళకు పట్టిన చీడను దులిపి కర్తవ్యాన్ని ప్రబోధించింది. ■



# కథాబ్రహ్మల కమామిషు

## పాతికమంది కథా రచయితల కృషిని పరిచయం చేసే ప్రయత్నం



**తెలుగు కథకులు- కథన రీతులు** (తొలిసంపుటం)
సంకలనం:మధురాంతకం రాజారాం, సింగమనేని నారాయణ
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్ శాఖలన్నీ.
పేజీలు: 268.
వెల: రూ.75/-

రెంటాల జయదేవ

కాలచక్ర పరిభ్రమణంలో కథా సాహిత్యం విస్తృతంగా వెలికివచ్చింది. కథలతో పాటు సహజంగానే కథకుల సంఖ్యా హెచ్చింది. తెలుగు సంగతికే వస్తే, ఆధునిక కథారచన వయసు తొమ్మిది పదులు కావస్తోంది. ఈ కాలంలో తెలుగునాట ప్రభవించిన కథాకల్హారాలు చాలా ఉన్నాయి. వాటిని లోకానికి అందించిన కథకుల గురువులూ అనేకులున్నారు. అయితే, ఒక్కొక్కరిదీ ఒక్కొక్క ఫణితి! లోకంలో పూవును పోలిన పూవు ఉన్నట్లే, కథను పోలిన కథలూ ఉంటాయి. కానీ, దేని పరిమళం దానిదే. ఆ వైశిష్ట్యం దానికా పరిమళాన్ని అద్దిన కథకునిది! అతని కథనరీతిది! ఒక్క రాశిలోనే కాకుండా వాసిలోనూ తెలుగు కథా రచయితలు భారతీయ భాషా రచయితలలో ఎవరికీ తీసిపోరు. గడచిన శతాబ్దకాలంలో తెలుగు కథాసాహిత్యంపై తమదైన ముద్ర వేసిన రచయితల పట్టీ రాయడం మొదలుపెడితే అంత తేలిగ్గా ముగియదు. కానీ, మధురాంతకం రాజారాం, సింగమనేని నారాయణలు మాత్రం ఆ బృహత్తర ప్రయత్నాన్ని తలకెత్తుకున్నారు. తెలుగు కథకులు - కథనరీతులు పేరిట మన కథాబ్రహ్మల విశేషాలనూ, వారి విశిష్ట రచనా విన్యాసాలనూ తెలియజెప్పాలని ప్రయత్నించారు.

> **పుస్తకాంశం**
>
> "రచయితల కథలు సంపుటాలలోనే కాక, వివిధ పత్రికల పుటల్లో మరుగున పడివున్నాయి. గ్రంథాలయాల్ని శోధించి, ఆ కథలనన్నింటినీ వెలుగులోకి తేవాలి. రచయితల గురించి విడి విడిగా సాహిత్య పరిశీలనలు జరగాలి." – పుట xi

ఇప్పుడు విడుదలైన తొలి సంపుటంలో గురజాడ, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి మొదలుకొని పూసపాటి కృష్ణంరాజు, పురాణం సుబ్రహ్మణ్య శర్మ వరకు కీర్తిశేషులైన ఓ పాతికమంది కథకుల రచనా వ్యవసాయాన్ని సమీక్షించారు. రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, అబ్బూరి ఛాయాదేవి, ఆర్.ఎస్. సుదర్శనం, రామమోహనరాయ్, పోరంకి దక్షిణామూర్తి, డాక్టర్ జంధ్యాల మహతీశంకర్, కాత్యాయనీ విద్మహే, పాపినేని శివశంకర్ లాంటి సాహితీవ్రతులు ఈ సమీక్షా వ్యాసాలను అందించారు. సంకలనకర్తలైన మధురాంతకం, సింగమనేని ఎంతో శ్రమించి, చిత్తశుద్ధితో ఈ సంపుటాన్ని రూపొందించారు. నిజం చెప్పాలంటే, మొత్తం ఈ పాతిక వ్యాసాల సంకలనాన్ని చదవడం నవరస సాహితీ విందు. గురజాడ కథా సంవిధానం, ఆయన కథావస్తువులు, రచనా శిల్పం గురించి విపులంగా తెలిపిన రాచపాళెం, "వర్తమాన సామాజిక విలువల్ని, వాటి మూలాల్ని ప్రశ్నించి చర్చకు పెట్టడం గురజాడ సాహిత్యతత్వం. ఆయన కథల్లోనూ అదే ప్రధాన లక్షణం" అని పేర్కొన్నారు.

ఇక రచయిత్రి వోల్గా, చలం కథల్ని సమీక్షిస్తూ, "ఆయన వంద కథలు రాస్తే వంద కథలలోనూ ఏదో ఒక కొత్త రీతి, కొత్త పోకడ మనకు కనిపిస్తూ ఉంటుంది. వస్తువు ఒకటే అయినప్పుడు కూడా కథ చెప్పటంలో ఆయనంత భిన్నత్వాన్ని చూపించిన రచయితలు ఎక్కువమంది లేరు" అంటారు. ఆమే కొడవటిగంటి కుటుంబరావు (కొ.కు) కథాసేద్యాన్ని వివరిస్తూ, "చాలా సీరియస్‌గా హాస్యం రాయటం కుటుంబరావు ప్రత్యేకత" అని చెబుతారు.

"వ్యవహారిక భాషా పరిణామాన్ని అధ్యయనం చేయదలచిన పరిశోధకులకు (చింతా) దీక్షితులుగారి సాహిత్యం ఒక తరగని బొక్కసం", "సమాజసేవ కోసం దీక్ష వహించిన కరుణ కుమారగారు 'తెలుగువారి ప్రేమచంద్'గా పాఠకులకు అభిమాన పాత్రులు కాగలిగారు" అని కథకులు మధురాంతకం తనదైన విశ్లేషణలు అందించారు. అడివి బాపిరాజు "...కథల్లో అన్యదేశ్యపదాల ప్రభావం బాగా కనబడుతుంది. ఈ అన్యదేశ్య పదాలు రాజుగారి శైలికి ఒక ఊపును, తూగును ఇచ్చి నూతనత్వాన్ని కలుగజేశాయి" అని డాక్టర్ వి. సిమ్మన్న అభిప్రాయపడ్డారు. రాసిన కథలు తక్కువే అయినా, రచయితగా తనదైన స్థానం సంపాదించుకున్న పూసపాటి కృష్ణంరాజు "కథనరీతి సహజరీతి" అని భ.రా.గో విశ్లేషించారు. ఇక పురాణం సుబ్రహ్మణ్యశర్మ కథల గురించి వివేచిస్తూ, "పురాణం కథలు దిగువ మధ్యతరగతి జీవితపు వెలుగు నీడల్ని చిత్రించి, జీవన మాధుర్యాన్ని అందించాయి. మునిమాణిక్యం వారి కథల కంటే పురాణం కథలలో విషాదం పాలు ఎక్కువ. అయినా, జీవితం జీవించటానికేననీ, విలువైనదనీ, కన్నీళ్ళనూ గలగల నవ్వుల్నీ ఇచ్చే జీవితాన్ని జారవిడుచుకోవద్దనీ పురాణం కథలు చెబుతాయి" అంటారు రామమోహనరాయ్. ఇలాగే, పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు, తిలక్ తదితరుల గురించి విమర్శకుల విశ్లేషణలు కొత్త విశేషాలతో మనల్ని పలకరిస్తాయి. నిర్మాణాత్మక ప్రయోజనం కోసం శ్రద్ధతో ప్రచురించిన ఈ తొలి సంపుటం చదివాక, మరింతమంది కథా రచయితల కృషిని సింహావలోకనం చేసే రెండో సంపుటం కోసం పాఠకులు ఎదురుచూస్తారంటే అతిశయోక్తి కాదు. ■